www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025



ఖోఖో పోటీలకు నల్లజర్ల విద్యార్థులు

ప్రజాశక్తి - నల్లజర్ల

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నల్లజర్ల హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు బేత ఉదయ పోసేశ్వరి, మైనం దుర్గభవానీ ఎన్నికయ్యారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తరపున తమ విద్యార్థినులు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల హెచ్ఎం చాగంటి కోమలిచిత్ర తెలిపారు. విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయులు పి.వెంకటఅప్పారావు, కె.రాంబాబు, వి. సుబ్రహ్మణ్యంలను ఎస్ఎంసి ఛైర్మన్ కోడూరి నారాయణ, గ్రామ పెద్ద పల్లి సుబ్బారావు, హెచ్ఎం కోమలిచిత్ర అభినందించారు.



విద్యార్థునులను అభినందిస్తున్న టీచర్లు

పేట్రేగుతున్న మట్టి మాఫియా

- రాత్రి, పగలూ తేడా లేకుండా తవ్వకాలు
- కాలువ భూములు సైతం ఆక్రమణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో మట్టి మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కాలువ గట్టుల మట్టిని ట్రాక్టర్లు, లారీల్లో తరలించుకుపోతూ కోట్లాది రూపాయలను కొల్లగొట్టేస్తున్నారు. మట్టి తవ్వకాలకు అడ్డుగా ఉన్న వృక్షాలను సైతం తొలగించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. మండలంలోని పోలవరం, తాడిపూడి, చింతలపూడి కాలువల భూముల్లో మట్టి గుట్టలు మాఫియా ఆగడాలతో మాయమవుతున్నాయి. రాజకీయ నేతల అండదండలు దండిగా ఉండటంతో మాఫియా ఇక్కడ రాజ్యమేలుతోంది.

ప్రభుత్వ భూముల ఆక్రమణ

మండలంలోని చెరుకుమిల్లి పరిధిలో పోలవరం కుడికాలువ, తాడిపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన కాలువలు ఉన్నాయి. పోలవరం, తాడిపూడి కాలువలు తవ్వకాల సమయంలో భారీగా మట్టి వచ్చింది. కాలువను అనుకుని ఉన్న భూములను అప్పట్లో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి ఈ మట్టిని ఆ స్థలాల్లో డంప్ చేసింది. ఈ మట్టిగుట్టలే రెండు కాలువలకు రక్షణ గట్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో పెద్దాపురం నుంచి చెరుకుమిల్లి శివారు వరకు ఉన్న కాలువ గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వానికి భూములు అమ్మిన ధనిక రైతులు కొందరు వాటిని మళ్లీ ఆక్రమిస్తున్నారు. మట్టి మాఫియా మట్టిని తవ్వుకుపోయిన వెంటనే ఖాళీ అయిన భూములను వారు దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. అంతేకాకుండా కాల్వ గట్లను సైతం కబ్జా చేస్తున్నారు. అనుమానం రాకుండా వాటిని వ్యవసాయ భూములుగా మార్చేస్తున్నారు. కాలువ భూములు ఆక్రమణలకు గురౌతున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కొన్ని చోట్ల ఈ భూములు చేపల చెరువులుగా దర్శనమిస్తుంటే మరికొన్ని చోట్ల ఏకంగా ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. రాంపాలెం, గుడ్డిగూడెం, వేలచింతలగూడెం, పెద్దాపురం, చిట్యాల, చెరుకుమిల్లి వరకు ఉన్న తాడిపూడి పోలవరం కాలువ గట్లు చాలా వరకు అన్యాక్రాంతమైంది. వాణిజ్య పంటలైన జామాయిలు, ఆయిల్ ఫామ్, జీడి మామిడి, ఇతర పంటలను ఆక్రమణదారులు సాగు చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఆగస్టు నెల నుంచి పోలవరం తాడిపూడి కాలువ నీటిని విడుదల చేస్తారు. సుమారు నాలుగు నుంచి ఐదు నెలల వరకు వాటర్ రెగ్యులేషన్ జరుగుతుంది. దీనిపై వాటర్ రెగ్యులేషన్ చేసేందుకు గుత్తేదారులను ఏర్పాటు చేస్తారు. సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు ఈ కాలువ వెంబడి పర్యవేక్షణ చేస్తూ ఉండాలి. కాని ఇదేమీ ఇక్కడ జరగట్లేదు. ఆక్రమణదారుల ముడుపులు అందుకోవడం వల్లే అధికారులు అటుగా చూడట్లేదనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

అపార నష్టం

కాలువలకు రక్షణగా ఉన్న మట్టిగుట్టలు తొలగించడం వల్ల కాలువ గట్లు బలహీనంగా మారుతున్నాయి. తుపానులు, వరదల సమయంలో కాలువలకు భారీగా నీరు వస్తే గండ్లు పడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా కాలువలు కోతకు గురయ్యే అవకాశం ఎక్కువ. ఇదే జరిగితే వేలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా నాశనమవుతాయి.



యంత్రాలతో మట్టి తవ్వకాలు(ఇన్‌సెట్‌లో కాలువ గట్టును సైతం తవ్వేసిన వైనం)



మట్టిని తవ్వేసిన స్థలంలో కూరగాయల సాగు

మట్టి తవ్వకాలను అరికట్టాలి



చీకటి పడితే చాలు పెద్దాపురం నుంచి చెరుకుమిల్లి వరకు ఉన్న పోలవరం, తాడిపూడి కాలువల మట్టిని తరలించేస్తున్నారు. ఇదే అదునుగా కొంత మంది తొలగించిన మట్టి స్థానంలో భూములను చదును చేస్తూ ఆక్రమిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో కాలువ గట్టు రోడ్డు ధ్వంసమైంది. పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నాం.

-సుంకర భవనీశంకర్, రైతు, చెరుకుమిల్లి

కాలువ భూములను రక్షించాలి



కాలువ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మట్టి గుట్టలు కనుమరుగవుతున్నాయి. గట్లకు పటిష్టత తగ్గడం వల్ల గండ్లుపడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలి, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి.

-బేతాళ శ్రీనివాస్, వ్యవసాయం కార్మిక సంఘం

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

మట్టి తవ్వకాలు జరిపిన పలువురిపై ఇప్పటికే కేసులు పెట్టాం. కాలువ భూములకు సంబంధించి మట్టి తవ్వకాలు జరిపిన, భూములు ఆక్రమణలు చేసినా చర్యలు తప్పవు. పోలీసు, రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేయించి ఆక్రమణలు తొలగిస్తాం. ఇప్పటికే మైనింగ్ అధికారులు మట్టి తరలిస్తున్న వాహనాలకు జరిమానాలు విధించారు.

-సిహెచ్.దేవప్రకాష్, ఇఇ, నీటిపారుదల శాఖ, తాడేపల్లిగూడెం డివిజన్



వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

పనితీరు మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వ శాఖల అధికారుల పనితీరు మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖల పనితీరు, సేవల నాణ్యత, లక్ష్యాల సాధన, ప్రజా సౌకర్యాల అభివృద్ధి వంటి అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ వంటి శాఖల ప్రాధాన్యత అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న అన్ని సేవల్లో పారదర్శకత, వేగం, నాణ్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రతి కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను రూ.3 లక్షల యూనిట్ కాస్ట్‌తో నిర్మిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రాంట్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్లేసుల్లో ప్రజల సౌకర్యార్థం ఈ కాంప్లెక్స్‌లు మంజూరు అవుతాయని స్పష్టం చేశారు. ఈ కాంప్లెక్స్‌లలో 2 టాయిలెట్లు, 2 యూరినల్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం కోఆర్డినేషన్ మీటింగ్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యటించి, పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో డెలివరీలు అధికంగా జరిగే ప్రయివేట్ హాస్పిటల్స్ వివరాలు, మాతృ మరణాలు చోటు చేసుకున్న ఆసుపత్రుల వివరాలు తప్పనిసరిగా నివేదించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.34.31 కోట్ల వార్షిక లక్ష్యం కాగా, అక్టోబర్ నాటికి కేవలం రూ.13.13 కోట్లు మాత్రమే వసూలు అయిందన్నారు. వసూళ్లను వేగవంతం చేయాలని, మార్కెట్ కమిటీ గోపాలపురం మార్కెట్లో ఇ.ఎన్ఎఎం పథకం అమలు చేయాలని ఆదేశించారు. నిత్యవసర సరుకులు, వినియోగదారులు వినియోగించే ఉత్పత్తులు మార్కెట్లకు తీసుకురావడంలో సిబ్బంది చొరవ చూపాలని, ఆమేరకు రైతులకు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి ఎస్.భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, సిపిఒ ఎల్.అప్పలకొండ, డిపిఒ వి.శాంతామణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కెఎన్.జ్యోతి, ఐసిడిఎస్ పీడీ టి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

తుపానుతో తగ్గిన దిగుబడి

ప్రజాశక్తి - గోపాలపురం

తుపాను ప్రభావంతో వరి దిగుబడి తగ్గిందని పంట కోత ప్రయోగం ద్వారా అంచనా వేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఏసుబాబు, ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం చిట్యాలలోని తానాల మధుసూదన్‌రావు వ్యవసాయ పొలంలో కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించడం ద్వారా ఎంత దిగుబడి వచ్చిందో అంచనా వేయడం జరుగుతుందన్నారు. పంట యొక్క సరాసరి దిగుబడి 29 బస్తాలు వస్తుందన్నారు. మండలంలో 11383 ఎకరాల వరి పంట వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యానవన సహాయకులు రామకృష్ణ, ఇన్సూరెన్స్ ఏజెంట్ గంజి శ్రీనుబాబు పాల్గొన్నారు.



కార్యదర్శి కమలావతిని సత్కరిస్తున్న అధికారులు

రెండో స్థానంలో మల్లవరం

ప్రజాశక్తి - చాగల్లు


పారిశుధ్య నిర్వాహణలో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో రాష్ట్ర స్థాయిలో మండలంలోని మల్లవరం పంచాయతీ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా గురువారం పంచాయతీ కార్యదర్శి జి.కమలావతిని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవీ, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ కుమార్, కార్యాలయ సిబ్బంది సత్కరించారు. శానిటేషన్ ఐవిఆర్ఎస్ కాలింగ్‌లో జిల్లాలో 75 శాతం అనుకూల మార్కులతో, మండలం స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని, రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - తాళ్లపూడి

స్థానిక శ్రీ పైడి ఐటిఐ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల అధికారులు కె.హరీష్‌చంద్రప్రసాద్, విడిజి. మురళీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్హతతో అనుభవం, ఆసక్తి ఉన్న 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని అన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్, బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

కార్టూ'నిజం'



నాటి పబ్లిసిటీ పనులతో నేడు ఇక్కట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

గత ప్రభుత్వంలో నాటి ఎంపి చేసిన పబ్లిసిటీ పనులు నేడు ప్రజలకు ఇక్కట్లును తెచ్చిపెడుతున్నాయని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసు విమర్శంచారు. గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ రాహూల్ మీనా, కూటమి నాయకులతో కలిసి గోదావరి రివర్‌ఫ్రంట్ పనులు, పుష్కర ఘాట్, దేవిచౌక్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నాటి ఎంపి తన వ్యక్తిగత పబ్లిసిటీకే అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శంచారు. ఎకెసి కాలేజి సమీపంలోని ఈట్ స్ట్రీట్ ప్రజలకు ఇష్టం లేదని, మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ అవసరం లేదని ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. అందువవలన వాటిని తొలగించామని చెప్పారు. దేవిచౌక్, పుష్కర ఘాట్ సెంటర్లలో రాళ్ళు వేశారని, వీటివలన ప్రజలు అనేక ఇబ్బందులకు ఎదుర్కుంటున్నారని,ఆ రాళ్ళను తొలగించడమా లేక వాటిపైనే రోడ్డు వేయడమా అనేది పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆ రాళ్ళ ఏర్పాట్లు విజిలెన్స్ విచారణ చేయించి ప్రజాధనం ఎంత వృథా అయిందో తేలుస్తామని అన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ రాహూల్ మీనా మాట్లాడుతూ వచ్చే మార్చి నాటికి రివర్ ఫ్రంట్ పనులు పూర్తవుతాయని అన్నారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలు కూర్చోవడానికి స్టేజ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఎంజాయ్ చేయవచ్చునన్నారు. ఈ పర్యటనలో జనసేన రాజమహేంద్రవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, టిడిపి సిటీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుష్కర ఘాట్ వద్ద పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్‌మీనా

లక్ష్య సాధనకు సహకరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కమిషనర్ రాహుల్‌మీనా కోరారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బ్యాంకర్లు, మెప్మా సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా పిఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారస్తులకు రుణాలను అందించేందుకు బ్యాంకర్లు శ్రద్ధ చూపాలన్నారు. నగర పరిధిలో రూ.15 వేలు, రూ. 25 వేలు, రూ. 50 వేలు రుణాల కోసం పెట్టుకున్న 2,058 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని.. వీటిని వారంలోగా పరిష్కరించి రుణాలు అందజేయాలని సూచించారు. నగరపాలక సంస్థ టిడ్కో గృహాలు కేటాయించిన లబ్దిదారులకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కొంత మంది లబ్దిదారులకు సాంకేతిక కారణాలతో రుణాల మంజూరు నిలిపివేశారని, అటువంటి వారికి కూడా పున్ణపరిశీలన చేసి రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయం మేరకు ప్రతి ఇంటికి ఒక మహిళా పారిశ్రామికవేత్త ఆవిర్భవించేలా చేయాలని కమిషనర్ సూచించారు. మహిళల అభివృద్ధికి అవసరమైన యూనిట్ల స్థాపనకు బ్యాంకుల నుంచి అందిస్తున్న రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ డివి.ప్రసాద్, మెప్మా పీడీ టి.కనకరాజు, సిఎంఎం రామలక్ష్మి, అన్ని శాఖల బ్యాంకు మేనేజర్లు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. జిల్లాలోని పలు గ్రంథాలయల్లో జరిగిన ముగింపు సభలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం సిటీ స్థానిక ఇన్నీస్ పేట శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ఛైర్మన్ చల్లా శంకరరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తల్లీదండ్రులకు, పెద్దలకు గౌరవాన్నివ్వాలని, చదువుతోనే సంస్కారం అలవడుతుం దన్నారు. లైబ్రరీలు జ్ఞాన కేంద్రాలని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ అయ్యంకి దుర్గా తులసిదాస్, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి బాబు, వాడ్రేవు అలివేలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీతంపేట గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో టిడిపి వార్డ్ ఇన్‌ఛార్జి బుడ్డిగ రవి, సీనియర్ టిడిపి నాయకులు బుడ్డిగ గోపాలకృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, డాక్టర్ సోమరాజు, కూచిపూడి నృత్య కళాకారుణి లక్ష్మి, పివిఎస్.కృష్ణారావు పాల్గొన్నారు. విజేతలకు వారు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి డి.వెంకటరమణ అధ్యక్షత వహించారు. అతిథులను సత్కరించారు. **చాగల్లు** మండలంలోని చంద్రవరం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు మద్దిపాటి వీరరాఘవులు, ఎంపిటిసి సభ్యులు గారపాటి వెంకట నరసింహమూర్తి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మద్దిపాటి రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటి ప్రతినిధులు కాసాని వెంకటేశ్వరరావు, మద్దిపాటి సూర్యారావు, సభ్యులు అన్నమరెడ్డి సూరిబాబు, పాల్గొన్నారు. **కొవ్వూరు** స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. గత వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు ఎంఎల్ఎ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, బివి.ముత్యాలరావు, అర్జల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **నల్లజర్ల** స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. **తాళ్లపూడి** స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకలో వ్యాపారవేత్త, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ మండల అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు సురేష్, రిటైర్డ్ ఎంఇఒ ఆంజనేయులు, గ్రంథ పాలకుడు నరేష్, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నిడదవోలు** స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వి.మోహనకృష్ణ, సుంకవల్లి ఉషారాణి మాట్లాడారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, పొన్నా కృష్ణబాబు, ఎస్‌వి.సుబ్బారావు, సుంకవల్లి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజమండ్రిలో బహుమతులు అందజేస్తున్న చల్లా శంకర్రావు

పరిహారం అందే వరకూ పోరాటం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం పూర్తి స్థాయిలో అందే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని సాగిస్తుందని పిసిసి ఉపాధ్యక్షుడు, ప్రాజెక్టు నిర్మాణ నిర్వాసితుల అధ్యాయన కమిటీ సభ్యులు సోడదాసి మార్టిన్ లూథర్, డిసిసి అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 89 వేల కుటుంబాలకు నేటికీ పరిహారం చెల్లించాల్సివుందన్నారు. డిశెంబర్ మొదటి వారంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి పోలవరం ప్రాజెక్టును సందర్శించి నిర్వాసితులతో మాట్లాడతారని అన్నారు. ఇప్పటికే నిర్వాసితుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఒక అధ్యాయన కమిటీని వేసిందని, ఇప్పటి వరకూ సేకరించిన అంశాలపై ఆమె సమీక్షిస్తుందన్నారు. ప్రాజెక్టు ఎత్తును తగ్గించి కేంద్రప్రభుత్వం రూ.25 వేల కోట్లను ఎగవేసిందని విమర్శంచారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించినా రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీ, నాయకులు బెజవాడ రంగారావు, దేవత సుధాకర్, కొవ్వూరి శ్రీనివా సరావు, కిషోర్ జైన్, నల్లా వీర్రాజు, బత్తిన చందరావు, సూరిబాబు పాల్గొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్

అండర్-19 క్రికెట్ జట్టుకు 'వర్ష' ఎంపిక

ప్రజాశక్తి - కడియం

కడియం పేపరు మిల్లులో సెక్యూరిటీ అధికారి కిలిమి మధుసూదనరెడ్డి కుమార్తె కిలిమి వర్షమాలినిదేవి జాతీయ స్థాయి అండర్ 19 క్రికెట్ జట్టుకు ఎంపికయింది. ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో విశేష ప్రతిభ కనబరచిన ఆమె జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆమె తండ్రికి క్రికెట్‌పై ఉన్న మక్కువతో తన కుమార్తె వర్షను క్రికెట్ క్రీడ పట్ల ప్రోత్సహించారు. తండ్రి ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె క్రికెట్ క్రీడలో రాణిస్తోంది. ప్రస్తుతం ఆమె ఒఎన్‌జిసి కేంద్రీయ విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం ఆమె టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తుంది. ప్రస్తుతం మధుసూదన్ రెడ్డి కుమారుడు జెతిన్‌రెడ్డి కూడా క్రికెట్లో రాణిస్తున్నాడు. తమ పిల్లలు శిక్షణ కోసం బొమ్మూరులో తన ఇంటి వద్దనే ప్రత్యేకంగా క్రికెట్ మేట్, నెట్ ఏర్పాటు చేసినట్లు తల్లిదండ్రులు మధుసూదనరెడ్డి, జయలక్ష్మి తెలిపారు.



వర్షతో తల్లీదండ్రుల, సోదరుడు

ఘనంగా తత్వ శాస్త్ర దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురువారం తత్వ శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామచంద్రరావు పాల్గొని మాట్లాడారు. పరీక్షించబడని జీవితం నిరర్థకమని, ప్రతి ఒక్కరూ జీవితంలో ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పేదే తత్వశాస్త్రమని అన్నారు. ఈ కార్యక్రమంలో వాడ్రవు సుందర్రావు, డాక్టర్ న్యాజిళ్ల శ్రీనివాస్, డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, తత్వ శాస్త్ర విభాగాధిపతి మహేష్, డాక్టర్ ఎస్.రాణి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఆర్ట్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రరావు

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో సొంత స్థలం ఉండి, ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని హౌసింగ్ ఎఇ బి.ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పక్కా ఇల్లు లేకుండా, కుటుంబ ఆదాయం నెలకు రూ.10 వేల లోపు ఉన్న పేదలు, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డు ప్రాతిపదికన, కుటుంబానికి ఒకరికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ ను సంప్రదించి ఆవాస్-2024 మొబైల్ యాప్ ద్వారా సర్వే పూర్తి చేయాలన్నారు. పూర్తి వివరాలు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించి, తెలుసుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్డ్ ఎంఇఒ రూ. 35 లక్షలు కాజేసిన వైనం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సైబర్ నేరగాళ్ల వలలో పడి రిటైర్డ్ ఎంఇఒ సుమారు రూ. 35 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఎంఇఒకు నవంబర్ 8న అపరిచిత వ్యక్తి వీడియో కాల్ చేశారన్నారు. మీ ఆధార్ ద్వారా రూ.3 కోట్ల అక్రమ లావాదేవీలు జరిగాయని, దీనిపై కేసు నమోదైందని హెచ్చరించారన్నారు. ఈ కేసు మాఫీకి రూ.70 లక్షలు ఇవ్వాలని ఆగంతకులు వాట్సాప్ కాల్‌లో బెదిరించారన్నారు. దీంతో భయపడిన రిటైర్డ్ ఎంఇఒ విడతల వారీగా బంధన్ బ్యాంక్ మహారాష్ట్ర శాఖకు రూ.15 లక్షలు, చెన్నై తిరువాయుర్ శాఖకు రూ.9.8 లక్షలు చొప్పున రెండుసార్లు వెరసి రూ.34.60 లక్షలు ఆగంతకులకు ముట్టజెప్పారన్నారు. అనంతరం మోసపోయానని గ్రహించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక టెలికం కాలనీలో ఈ నెల ఉపాధ్యాయుడు పెంకే సింహాచలం ఇంటిలో రూ.6 లక్షలు నగదు చోరీ చేసిన నిందితుని అరెస్టు చేసినట్టు డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. గురువారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న రాత్రి పెద్దాపురం-సామర్లకోట రహదారిలో ఉన్న అయోధ్య ఆలయ గ్రౌండ్ లే అవుట్ వద్ద ఎర్రంశెట్టి చరణ్ విగ్నేష్‌ను అరెస్టు చేసి రూ.3,60,000 నగదు, ఒక సెల్ ఫోన్, హోండా యాక్టివా బైక్ రికవరీ చేశామన్నారు. తన కుమార్తె పెళ్లి కోసం ఇంటిలో ఉంచిన రూ.6 లక్షలు చోరీకి గురైనట్లు ఉపాధ్యాయుడు సింహాచలం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ సమావేశంలో సిఐ విజయ శంకర్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

కిర్లంపూడి మండలం వేలంక గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేసిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.9,600 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు.

పుంగనూరు ఆవు దూడ అపహరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్లలో మేలు జాతి పుంగనూరు ఆవు దూడ బుధవారం అర్ధరాత్రి అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పినపళ్లకు చెందిన ఎంపిటిసి సభ్యులు పెద్దిరెడ్డి పట్టాభి రామన్నకి చొప్పెల్లలో ప్రత్యేక కార్యాలయం ఉంది. అక్కడే వివిధ రకాల పశు సంతతిని పెంచుతున్నారు. మకాంలో పుట్టిన పుంగనూరు జాతి దూడ పుట్టింది. ఆ దూడను ఇటీవల కొందరు బేరగాళ్లు సుమారు రూ.2.50 లక్షలకు అడిగిన ఆయన అమ్మడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని దుండగులు కార్యాలయ సిసి కెమెరా వైర్లను కట్ చేసి బుధవారం అర్ధరాత్రి అపహరించుకు పోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

మక్కా మృతులకు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఇటీవల మక్కా యాత్రికులు బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ పాల్గొని నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైనార్టీ సెల్ ప్రతినిధులు మీర్జా మౌలాలి, ఎండి హమీద్ బాషా, ఎస్.కె ఇబ్రహీం బాషా, ఎస్.కె మౌలాలి, ఎండి మస్తాన్ బేగ్, ఎస్ కె మీరావలి, ఎండి కరీం బాషా, ఎస్.కె ఛానాపాల్గొన్నారు.

.మాక్ అసెంబ్లీ సమావేశానికి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - కడియం


కందుకూరి సంధ్య

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి మండలంలోని వీరవరం జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని కందుకూరి సంధ్య ఎంపికయింది. నవంబర్ 26 వ తేదీన అమరావతిలో జరగనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ఆమె పాల్గొంటుందని పాఠశాల హెచ్ఎం ఎస్‌పికె.విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను సర్పంచ్ బత్తుల నళిని, ఎస్ఎంసి ఛైర్మన్ గుమ్మడి నాగలక్ష్మి, ఎంఇఒలు మణికుమార్, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బాలల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం జరిగింది. గురువారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో శాఖ సాధికారత అధికారి టి.శ్రీదేవి మాట్లాడుతూ వ్యక్తిగత భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. మంచి, చెడు స్పర్శ మధ్య తేడా, శరీర రహస్య భాగాల రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఆత్మవిశ్వాసంతో ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ అమీనా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆర్. అనంతప్రదీప్, ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.క్రాంతిలాల్, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ ఎస్.శ్రీగౌరి, సోషల్ వర్కర్ వి.శిరీష, హెచ్ఎం ఇందిరా ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు రుణాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

పిఎం స్వానిధి పథకంలో చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు మెప్మా పీడీ కనకరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల్లో పెండింగులో ఉన్న చిరు వ్యాపారుల రుణాల దరఖాస్తుల త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ

నియోజకవర్గంలో ప్రజలకు నిరంతరాయంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానికంగా ఉన్న ఎంఎల్ఎ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవలందించారని కొనియాడారు. భవిష్యత్తులో మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం అధికారులు సహకరించాలని సూచించారు. నియోజకవర్గంలో 144 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాగా, వాటి పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నందుకు అధికారులను అభినందించారు. నియోజకవర్గంలో మంజూరైన 433/11 కెవి సబ్ స్టేషన్ల ప్రగతిని సమీక్షించారు. ముక్కినాడ 433/11 కెవి సబ్ స్టేషన్‌కు భూమి కేటాయింపును వేగవంతం చేస్తామని తెలిపారు. కలవచర్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో 433/11 కెవి సబ్ స్టేషన్ మంజూరుకు వెంటనే భూమి బదలాయిస్తామని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 33 కెవి సబ్ స్టేషన్ పనుల వివరాలు తెలుసుకున్నారు. కోటికేశ్వరంలో 433/11 కెవి సబ్ స్టేషన్ మంజూరు కోసం మంత్రి దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. కొత్తగా ప్రతిపాదించే ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, సబ్ స్టేషన్ల వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని అన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణతో పాటు, ఇంటి విద్యుత్ అవసరాలు తీర్చుకోవడమే కాకుండా, మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం ఆర్జించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ రుణాల బిల్లులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - పెరవలి


వినతిపత్రం అందజేస్తున్న బిఎస్‌పి నాయకులు

గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల్లో నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని బిఎస్‌పి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గురువారం స్థానిక హౌసింగ్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా అనంతరం సంబంధిత శాఖ ఎఇ వి.సతీష్‌కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఎస్‌పి నాయకులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు మార్చడంతో నాటి ప్రభుత్వాన్ని నమ్ముకొని అప్పులు చేసి, ఇళ్ళు నిర్మించుకొన లబ్ధిదారులు బిల్లులు కోసం ఎదురుచూస్తు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మండలంలో సుమారు 700 మంది వరకు నష్ట పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్రా రాజు, నల్లి రమేష్, చల్లాబత్తుల సత్యనారాయణ, బద్దా జాన్, కప్పల ఇజ్రాయెల్, చిగురుపాటి రాఘవ, గుడపాటి వెంకటేశ్వారారావు, చదలవాడ రాంబాబు, గుమ్మాపు రత్నంరాజు, బీర ప్రవీణ్, ఉబా పండు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు చాగల్లు విద్యార్థులు


ప్రజాశక్తి - చాగల్లు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చాగల్లు జడ్‌పి హైస్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు అండర్ 19 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. గత నెలలో పెదవేగిలో జరిగిన అండర్ 19 జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులు టి.ప్రసన్న, వి.శాంతి, ఎం.భవాని, జె.జోష్ణవి, డి.కృష్ణశైలజ, జయలక్ష్మి, వెంకట నాగసిరి, జై.మౌనిక, వి.వైష్ణవి, మక ఘనసంజన, బాలుర విభాగంలో జి.సత్యగణేష్, వి.విజయఆనంద్, కె.జయదీప్‌పవన్, వి.వినయ్‌లను గురువారం పాఠశాల హెచ్ఎం వాసవి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని పీడీ తెలిపారు.

కాలం చెల్లిన బస్సులకు స్వస్తి చెప్పాలి

ప్రజాశక్తి - నిడదవోలు


వినతిపత్రం ఇస్తున్న జువ్వల రాంబాబు

కాలం చెల్లిన బస్‌లకు స్వస్తి చెప్పాలని, హైద్రాబాద్ విశాఖ పట్నాలకు కొత్త సూపర్ లగ్జరీ బస్‌లు నడపాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు కోరారు. గురువారం ఆర్‌టిసి డిఎం టి. ధనుంజయకు ఆయన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసివేసిన డిపోను ప్రజా ఆందోళనతో 2015లో తిరిగి ప్రారంభించారని, ఆ సమయంలో 26 బస్‌లు ఇచ్చారని గుర్తు చేశారు. నాటి నుంచి అవే బస్సులతో సేవలందిస్తున్నారని అన్నారు. కాలం చెల్లిపోయిన బస్సులతో ప్రజల ప్రాణాలను బలి తీసుకోవడం సరికాదన్నారు. ఏలూరు, పోలవరం, జంగారెడ్డిగూడెం సర్వీసులు క్రమ పద్ధతిలో నడపటం లేదని, సర్వీసులు రద్దు చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నరసాపురం నైట్ హాల్ట్ పంపాలని, హైదరాబాద్ ప్లాట్ ఫామ్‌లో ప్రయాణికులు కూర్చోకుండా కార్గో సామాన్లు పెడుతూ ప్రయాణికులకు ఇబ్బంది కలుగ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి

సిటీ, రూరల్ రూపు రేఖలు మారుస్తాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాబోయే పుష్కరాల నాటికి సిటీ, రూరల్ నియోజకవర్గాల రూపు రేఖలను మారుస్తామని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గురువారం గోరంట్ల స్వగృహంలో మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన అనేక విషయాలపై చర్చించారు. నూతనంగా 5 ఎంఎల్‌టి ప్లాంట్లు నిర్మించాలని, మెయిన్ రైల్వే స్టేషన్ రోడ్డు, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్లను విస్తరణ చేయాలని, ప్రధాన డ్రెయినేజీ నిర్మించాల్సిన అవసరం ఉందని, హుకుంపేట మెయిన్ డ్రెయినేజీని చివరి వరకు నిర్మించాలని, క్వారీ సెంటర్ నుంచి మల్లయ్య పేట వరకు రోడ్డును విస్తరణ చేసి సిసి రోడ్డు నిర్మించాలని, ఎస్‌విజి మార్కెట్ నుంచి 100 అడుగుల రోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేసి డ్రెయినేజీ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, వార్డులన్నింటిని జీరో వర్క్ వార్డులుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఇ శేషగిరిరావు, రిటా, మున్సిపల్ ఇఇలు మాధవి, ఆలీ, డిఇలు సత్యనారాయణ, లోవరాజు, రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జెవివి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఈ నెల 23న సీతంపేటలోని ప్రగతి జూనియర్ కళాశాలలో జరుగుతాయని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు విభాగాల్లో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ జిల్లా స్థాయి పోటీలకు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో నిలిచిన జట్లు డిసెంబర్ 12, 13, 14న కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని ఆయన తెలిపారు.

బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - దేవరపల్లి

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండల అధ్యక్షులు పప్పు వెంకట రామారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2018 జూలై నుంచి నేటి వరకు ప్రభుత్వం చెల్లించాల్సిన వివిధ రకాల బకాయిలు మొత్తం సుమారు రూ.30 వేల కోట్ల వరకూ ఉందన్నారు. పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలతో రోజు రోజుకీ ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందని అన్నారు. బకాయిల చెల్లింపునకు వనరుల కొరత సాకుగా చూపరాదన్న సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించి, అన్ని బకాయిలను ఒకే దఫా న్యాయమైన వడ్డీతో చెల్లించాలని ఆయన కోరారు.

ఇంద్ర బస్సులో 15 శాతం రాయితీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రయాణికుల సౌకర్యార్థం రాజమహేంద్రవరం డిపో నుంచి హైదరాబాదు వెళ్ళే ఎసి ఇంద్ర బస్సుకు 15 శాతం రాయితీ కల్పించినట్లు జిల్లా రవాణాధికారి వైఎస్ఎన్.మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ, నాన్ ఎసి టికెట్టు ధరను చెల్లించి ఇంద్ర ఎసి బస్సులో ప్రయాణించవచ్చునని తెలిపారు. ఈ ఆఫర్ డిశంబర్ 31 వరకు ఉంటుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎపిఎస్ఆర్‌టిసి ప్రయాణం సురక్షితమని తెలిపారు. సాధారణ టిక్కెటు ధర రూ.1060 అని, ప్రస్తుత రాయితీ ధర రూ.920 నిర్ణయించామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - నల్లజర్ల

వైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టి ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా గురువారం సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం జరిగింది. తొలుత ఎకెఆర్‌జి జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, క్రెడిట్, డెబిట్ కార్డు క్లోనింగ్ తదతర అంశాలపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పరిసర ప్రాంతాలు, మెయిన్ సెంటర్‌లోని షాపుల వద్ద ప్రజలకు సైబర్ నేరగాళ్ల ఎలా మోసం చేస్తారో వివరించారు. ఆయా కార్యక్రమాల్లో వైజ్ అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డివిజనల్ అధికారి బాలమణి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గండేపల్లి సచివాలయం వద్ద మండల పంచాయతీ కార్యదర్శితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో ఇంటి పనులు వసూలు చేయడం వేగవంతం చేయాలని సూచించారు. సంపద కేంద్రాలని అభివృద్ధి చేయాలని, ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాస్, పంచాయతీ అధికారులు ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్, మెప్మా సిబ్బందికి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నిడదవోలు


ముగ్గులను పరిశీలిస్తున్న అధికారులు

పట్టణంలో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలలో భాగంగా గురువారం రోటరీ కల్యాణ మండపం ఆవరణలో మున్సిపల్, మెప్మా సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు ఈ నెల 26, 27, 28 తేదీలలో జరిగే వజ్రోత్సవ వేడుకలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎస్‌పి

వార్షిక తనిఖీలో భాగంగా గురువారం సౌత్ జోన్ డిఎస్‌పి ఎస్.భవ్య కిషోర్ ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది, సచివాలయం జిఎంఎస్‌కె సిబ్బందితో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు స్టేషన్‌కు వచ్చే బాధితులను మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. 112 కాల్స్‌కు వెంటనే స్పందించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలు, మైనర్ బాలికలపై జరిగే నేరాల విషయంలో పోలీసు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు అప్పగింత న్యాయం జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ హోల్డర్లు, బ్లేడ్ బ్యాచ్‌లపై నిరంతర నిఘా పెట్టి వారి కదలికలను జాగ్రత్తగా గమనించాలని ఆమె ఆదేశించారు. స్టేషన్ పరిధిలో మరింత భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయించి నేరాలను ముందుగానే నిరోధించాలన్నారు. సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ వినియోగంపై వార్డుల వారీగా అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆమె సూచించారు. సేవల నాణ్యతను మరింతగా మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ టి.గణేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, చాగల్లు

ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో థీమ్-5లో భాగంగా పచ్చదనం- పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్య వంతమైన సమాజాన్ని తీర్చిదిద్దవచ్చునని సూచించారు. మండల విస్తరణ అధికారి ఆంజనేయ శర్మ మాట్లాడారు. ట్రైనర్లు పసలపూడి కార్యదర్శి ఎం.శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. అలాగే చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజాతిలక్, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవం

ప్రజాశక్తి - దేవరపల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ డి.సువర్ణరాజు పాల్గొని మాట్లాడారు. వారోత్సవాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు ఉప్పులూరి రామారావు, రమాదేవి, సిపిఎం నాయకులు ఉండవెల్లి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.